లక్ష్మీనరసింహస్వామికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట, డిసెంబర్ 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో శుక్రవారం కార్తిక మాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు లక్ష పుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వయంభూ ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. అర్చక బృందం, వేద పండితులు స్వామి, అమ్మవార్ల సహస్రనామ పఠనాలతో వివిధ రకాల పూలతో లక్షపుష్పార్చన పూజలను సుమారు రెండు గంటల పాటు కొనసాగించారు. నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా జరిపారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. ఉదయం శ్రీసుదర్శన నారసింహహోమం జరిపారు. సుదర్శన ఆళ్వారులకు కొలుస్తూ హోమం నిర్వహించారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల వెండిమొక్కు జోడుసేవ, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్తికమాసం సందర్భంగా కొండ కింద వ్రత మండపం వద్ద సత్యనారాయణ స్వామివారి వ్రత పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. సాయంత్రం అద్దాల మండపంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవను కోలాహలంగా నిర్వహించారు. పరమపవిత్రంగా నిర్వహించే సేవలో మహిళలు పాల్గొని తరించారు. ముత్తయిదువులు మంగళహారతులతో అమ్మవారిని స్తుతిస్తూ పాటలు పాడుతూ సేవ ముందు నడిచారు. తిరువీధి సేవ అనంతరం అమ్మవారిని అద్దాల మండపంలోని ఊయలలో శయనింపు చేయించారు. గంట పాటు వివిధ రకాల పాటలతో అమ్మవారిని కొనియాడుతూ లాలి పాటలు కోలాహలంగా కొనసాగాయి. కొండపై వేంచేసి ఉన్న పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారికి అర్చకులు, పురోహితులు అభిషేక పర్వాలు జరిపారు. శుక్రవారం స్వామివారిని సుమారు 22 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 34,50,805 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఎన్. గీత, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి తెలిపారు.

యాదగిరిగుట్ట ఆలయ ముఖమండపంలో స్వామి, అమ్మవార్లకు లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పరామర్శ

తన ఇంట్లో ప్రమాదవశాత్తు కింద పడి హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను శుక్రవారం ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పరామర్శించారు. కేసీఆర్‌ను పరామర్శించి ఆస్పత్రి నుంచి బయటికి వస్తున్న మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి.

ఎంజీయూ క్రాస్‌కంట్రీ జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, అధికారులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- ఎంజీయూ స్పోర్ట్స్‌బోర్డు కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి
- ఐసీటీ క్రాస్‌కంట్రీ వర్సిటీ జట్లు ఎంపిక

రామగిరి, డిసెంబర్ 8 : విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్స్(ఐసీటీ)లో భాగంగా శుక్రవారం నిర్వహించిన క్రాస్‌కంట్రీ పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు సైతం అన్ని హక్కులను సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్నారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ఎంజీయూ నుంచి దాసరిగూడెం వరకు 10 కిలోమీటర్లు క్రాస్‌కంట్రీ పరుగు పందెంలో పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని వర్సిటీ స్త్రీ, పురుషుల జట్లుకు ఎంపిక చేశారు. విజేతలకు బంగారు పతకాలను అందించారు. కార్యక్రమంలో వర్సిటీ అభివృద్ధి అధికారి డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి, ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై. శ్రీనివాస్‌రెడ్డి, ఆర్. మురళి, ఎన్జీ కళాశాల పీడీ కడారి మల్లేశ్, ఉమ్మడి జిల్లాలోని వివిధ కళాశాలల పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంజీయూ పురుషుల జట్టుకు ఎంపికైన విద్యార్థులు

ఎస్.అఖిల్‌కుమార్ (జోన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అయిటిపాముల – కట్టంగూర్), వి.ధనుశ్, ఆర్. రవీందర్, ఎం.ముఖేశ్, సీహెచ్. రాకేశ్(ఎన్జీ కళాశాల –నల్లగొండ), ఎన్.లింగస్వామి(ప్రభుత్వ డిగ్రీ కళాశాల– రామన్నపేట), సీహెచ్. ప్రసాద్(ప్రభుత్వ డిగ్రీ కళాశాల– హుజూర్‌నగర్), వి.సైనిక్, బి.సిద్దు(ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాల– భువనగిరి)

మహిళల విభాగంలో..

ఎం.ఉమ, డి.కల్యాణి (గౌతమి డిగ్రీ కళాశాల– సూర్యాపేట), షహనాజ్, ఎ.శివప్రియ, టి.మహేశ్వరి, కె.స్నేహలత (సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాల– భువనగిరి), ఎ.కల్యాణి(శ్రీకృష్ణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల– శ్రీరాంపురం, హలియా), కె.పావని(సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల – దేవరకొండ), బి.అలోకిత (సాంఘిక సంక్షేమ మహిళా గురకుల డిగ్రీ కళాశాల –సూర్యాపేట)

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన విద్య

- రాష్ట్ర కళాశాలల విద్యాశాఖ జేడీ యాదగిరి

రామగిరి, డిసెంబర్ 8 : మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర కళాశాలల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి. యాదగిరి అధ్యాపకులకు సూచించారు. నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఎన్జీ కళాశాలలో కొత్తగా నిర్మిస్తున్న భవనాల సముదాయాని పరిశీలించారు. వాటిని త్వరగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు. అనంతరం ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. కళాశాలల్లో అమలు చేస్తున్న విద్యావిధనం, విద్యార్థుల అభివృద్ధి, కళాశాల ఆర్థిక అంశాలు, అధ్యాపకుల పనితీరు వంటి విషయాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, కళాశాలల విద్యాశాఖ సూచించిన కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఎంజీయూలో జరిగిన క్రాస్ కంట్రీ పోటీల్లో విజేతలుగా నిలిచి వర్సిటీ జుట్టుకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఆయన వెంట ఎన్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాల కొత్త భవనంలో తరగతి గదులను పరిశీలిస్తున్న కళాశాలల విద్యాశాఖ జేడీ జి.యాదగిరి

ఘనంగా గంధోత్సవం

- అర్వపల్లి ఉర్సు షురూ
- వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు

అర్వపల్లి, డిసెంబర్ 8 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండల కేంద్రం సమీపంలోని హజ్రత్ సయ్యద్ ఖాజా నసీరుద్దీన్‌బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఉత్సవాలకు ఉమ్మడి నల్లగొండ జిల్లాతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దర్గా పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. అర్వపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి దర్గా వరకు గంధం ఊరేగింపు వైభవంగా సాగింది. డీఎస్పీ నాగభూషణం, ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్, వక్స్ బోర్డు ఇన్‌స్పెక్టర్ మహమూద్ గంధం ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా పక్కీరుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గంధాన్ని దర్గాలోకి తీసుకొచ్చిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉర్సు సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వ్యాపారులు దర్గా ఆవరణలో దుకాణాలను ఏర్పాటు చేవారు. రాష్ట్రం నలుమూలల నుంచి హిందూ, ముస్లింలు వేలాదిగా తరలివచ్చారు. భక్తుల రద్దీకి అనుగుణంగా వక్ఫ్‌బోర్డ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 75 మంది పోలీసులు, ఎస్ఐలు, ఏఎస్ఐలు బందోబస్తులో పాల్గొంటున్నట్లు ఎస్ఐ అంజిరెడ్డి తెలిపారు. ఉర్సును ప్రశాంతంగా నిర్వహించేందుకు భక్తులు, నిర్వాహకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు శివశంకర్, బ్రహ్మమురారి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచార్యులు, ముజావర్ సయ్యద్ అలి, మండల కోఆప్షన్ సభ్యుడు హమీద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మోరపాక సత్యం, నర్సింగ్ శ్రీనివాస్, వేల్పుల రమేశ్ పాల్గొన్నారు.

గంధం ఊరేగింపులో పాల్గొన్న డీఎస్పీ నాగభూషణం, ముస్లింలు

దర్గా ఆవరణలో నిద్రిస్తున్న భక్తులు